టిడిపి నాయకుడిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణానికి చెందిన టిడిపి నాయకులు మల్లూరు రెడ్డి వరప్రసాద్‌పై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. అయన మందుల దుకాణంలో ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది. దాడిలో గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాళ్ళు, కర్రలతో దాడి చేయడంతో దుకాణం అద్దాలు పగిలిపోయాయి. సెల్ ఫోన్ కూడా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ అల్లరి మూకలు విజృంభించి, దాడిచేసి షాపు ధ్వంసం చేశారన్నారు. కొద్ది నెలలుగా రాముడు కనెక్ట్స్ అనే సామజిక మధ్యమాలలో అంతు చూస్తానని బెదిరించారాని, అందుకే ఇప్పుడు మళ్లీ తనపై దాడి చేశారన్నారు. పోలీసు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు.

వేతనాలు పెంచే వరకూ పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచేవరకు పోరాటం ఆపబోమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు శంకరయ్య, బి.వి.రమణ, అక్బర్, చెన్నయ్య, రాంబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగం కార్మికులు చేపడుతున్న సమ్మె ఆదివారం కొనసాగింది. సమ్మెలో భాగంగా కార్మికులు నిరసనదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 36 జిఒ అమలులో భాగంగా పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు కూడా రూ. 21 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికుల మనోభావాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం స్పష్టమైన జిఒను జారీచేస్తారని తాము ఆశిస్తున్నట్లు చెప్పారు. కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. పారిశుధ్య విభాగం డ్రైవర్లకు రూ.24,500లు చొప్పన వేతనం ఇవ్వాలని కోరారు. టిఎల్ఎఫ్ ద్వారా కార్మికులకు 8 నెలల పెండింగ్ పిఎఫ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్మికులను ఆప్కాస్ కింద కొనసాగిస్తూనే పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహ రించుకోవాలంటూ కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ. 5లక్షలు అందివ్వడంతో పాటు ఉద్యోగ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నేతలు రెడ్డిప్రసాద్, రమణారెడ్డి, ప్రసాద్, మంగమ్మ, రమాదేవి, మల్లిఖార్జున, గంగులయ్య, క-ష్ణారెడ్డి, బ్రహ్మయ్యతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

రాయచోటిలో నిరసన దీక్షలు చేపడుతున్న మున్సిపల్ కార్మికులు

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో నగర పంచాయతీలో గత నాలుగు రోజుల నుంచి విధులు బహిష్కరించి సమ్మె నిర్వహిస్తు న్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద వినూత పద్ధతిలో కళ్ళకు గంతలు కట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు డి.వెంకట్రామయ్య,సురేంద్రబాబులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. డిఎ, కరువు భత్యం ఇవ్వాలన్నారు. దుమ్ము, ధూళి, దుర్గంధం భరిస్తూ పట్టణ పరిశుభ్రతకు పాటుపడుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని అన్నారు. తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కూడా అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. ఆఖరికి రేషన్ కార్డులు కూడా తొలగిస్తున్నారన్నారు. షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారిశుధ్య కార్మికులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 17రోజుల సమ్మెకాలపు ఒప్పందాలు అయిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, హామీలకు జిఒలు జారీచెయ్యాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చెయ్యాలని కోరారు. చనిపోయిన, రిటైర్మెంట్ అయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు ఇవ్వవలసిన రక్షణ పరికరాలను, పని పరికరాలను ఇవ్వాలని కోరారు. గత ఐదేళ్లుగా స్థానికంగా ఇంజినీరింగ్ కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, చెప్పులు, యూనిఫారం, రైన్ కోటు, లాంటి రక్షణ పరికరాలు కూడా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అట్టడుగు వర్గాలుగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు కావడి రవీంద్ర పాల్గొని వారి పూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వి.శివకుమార్ కోశాధికారి జి.వెంకటేష్ నగర పంచాయతీ కార్మికులు గోపాలు, వెంకటరమణ, భారతమ్మ, గంగులమ్మ, రామలక్ష్మి, లఘుమక్క పాల్గొన్నారు.

కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు

ఆలయాల అభివృద్ధికి కృషి

జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో ప్రజలకు, యాత్రికులకు అందుబాటులో ఉండి ఆలయాలు, భూముల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి. విశ్వనాథ్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో దేవాలయాల వివరాలు, వాటిని అభివృద్ధి ఎలా చేయాలో, నూతన ఆలయాలను ఎన్ని నిర్మిస్తున్నారో, ఆలయాల సిబ్బంది, భూములను ఎలా అభివృద్ధి చేయాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లా లో ఆలయాలు వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా మొత్తం 1679 ఆలయాలున్నాయి. 30 సత్రాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏడుగురు ఆలయ ఇఒలున్నారు. ఇందు లో గ్రేడ్ – 1, గ్రేడ్ – 2, గ్రేడ్ – 3లలో ఇద్దరు చొప్పున ఇఒలు ఉన్నారు. శ్రీ రెడ్డమ్మ దేవత దేవస్థానం చెర్లోపల్లి గ్రామం, గుర్రంకొండ మండలం, శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం రాయచోటిటౌన్, శ్రీ గంగమ్మ దేవత దేవస్థానం అనంతపురం గ్రామం లక్కిరెడ్డిపల్లి మండలం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం మదనపల్లె టౌన్, సుండుపల్లె, రాజంపేట గ్రూప్ దేవస్థానాములు, వాయలపాడు, బి కొత్తకోట గ్రూప్ ఆలయాలున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఆలయాల భూముల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా 9761.3 ఎకరాలున్నాయి. బి కొత్తకోట 380.95, చిన్నమండెం 445.16,చిట్వేల్ 187.17, గాలివీడు 686.63, గుర్రంకొండ 350.6, కలకడ 182.64 ,కలికిరి 315.93,కె. వి. పల్లి 218.52, రైల్వేకోడూరు 534.23, కురబలకోట 417.91, లక్కిరెడ్డిపల్లి 205.54, మదనపల్లి 233.39, మొలకలచెరువు 270.58, నందలూరు 50.93, నిమ్మనపల్లి 132.17, ఓబులవారి పల్లి 185. 85,పెద్దమండ్యం 395.58, పెద్దతిప్ప సముద్రం 1194.59, పెనగలూరు 195.2,పీలేరు 220.1, పుల్లంపేట 190.22, రాజంపేట 262.83, రామాపురం 321.35, రామ సముద్రం 608.24, రాయచోటి 196. 53, సంబేపల్లి 253.19,సుండుపల్లి 265. 88, తంబళ్లపల్లి 471.6, వాయల్పాడు 208.67, వీరబల్లి 179.12 ఎకరాలు జిల్లా వ్యాప్తంగా భూములున్నాయి.

ఆక్రమణకు గురైన భూములపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లా వ్యాప్తంగా 52 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించడం జరిగింది. వారందరికీ నోటీసులు ఇచ్చాం. ఇటీవల కాలంలో రామసముద్రం మండలం కురిజాల గ్రామంలో 1.60 సెంట్లు భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. కలకడ మండలం ఎనుగోడపాలెంలో వీరభద్ర స్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నెంబర్ 721లో 3.93 సెంట్లుకు దేవాదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్‌ల సహకారంతో స్వాధీనం చేసుకున్నాం. ఆక్రమణకు గురైన మిగులు భూములను కూడా త్వరలో స్వాధీనం చేసుకు ంటాం. జిల్లాలో ఎవరైనా ఆలయాలు భూములు ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తే అలాంటి వారి పైన కఠిన చర్యలు తీసుకుంటాం.

జిల్లాకు కొత్తగా నూతన ఆలయాల ఏమైనా మంజూరైనాయా?

జిల్లావ్యాప్తంగా 231 ఆలయాలు మంజూరయ్యాయి.. ఇందులో మొదటి విడతలో 57, 2వ విడతలో 61, మూడవ విడతలో 61 నాలుగో విడతలు 52 పాలయాలు మంజూరయ్యాయి. ఇవి దాదాపు 90 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. ఈ ఆలయాల నిర్మాణ పనులు కమిషనర్ దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. జిల్లాలో గత ప్రభుత్వంలో ధూపం నైవేద్యం పథకం కింద 280 ఆలయాలను గుర్తించి వారికి రూ. 5 వేలు చొప్పున ఇస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారికి రూ.5 పెంచి రూ.10 వేలు ఇస్తోంది. వేద కళాశాలలో చదివిన జిల్లాకు చెందిన ఆరుగురికి నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ప్రతి నెలా వారికి అందజేస్తున్నాం. టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బి.సి కాలనీలలో 10 లక్షల స్కీము కింద అన్నమయ్య జిల్లాలో వివిధ ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నాం.

ఆలయాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

2019 నుండి 20 24 వరకు శిథిలావస్థలో ఉన్న ఆలయాల జీర్ణోద్ధరణ కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం చేసేందుకు సర్వశ్రేయోనిధి అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. తద్వారా రూ.35 కోట్లనిధులు మంజూరయ్యాయి.

జిల్లాలో ఆలయాల లో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా ఏడుగురు కార్యనిర్వహణాధికారులు, ముగ్గురు తనిఖీదారులు కడప, రాజంపేట ఇన్‌స్పెక్టర్లు వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలో పని చేయాలి. మదనపల్లె ఇన్‌స్పెక్టర్ తిరుపతి, చిత్తూరు జిల్లాలో అదనపు బాధ్యలు చేపట్టారు. జిల్లాలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నాం.

యాత్రికులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ప్రస్తుతం దేవాలయ భూములకు ఇచ్చే కౌలు మొత్తం చాలా తక్కువగా వస్తుంది. ఇతర భూములతో పోల్చుకొని ఆలయ భూములకు కౌలు మొత్తం పెంచాల్సిన అవసరముంది. ఆల భూముల ఆక్రమణ దారులను గుర్తించి దేవాదయ శాఖ చట్టం ప్రకారం నోటీసులును ఇచ్చి ఆక్రమణలను తొలగించుటకు చర్యలు తీసుకుంటున్నాం. ఆలయాలకు సబంధించిన ఎటువంటి సమస్య కానీ ఆక్రమణ దారుల గురించి కానీ రాయచోటిలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం పక్కన ఉన్నటువంటి జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

ఎస్‌పి వల్ల నా ప్రాణాలకు ముప్పు

-గుండె వ్యాధితో బాధపడుతున్నా తప్పుడు కేసులు పెట్టారు
- మా ఇంటికి నోటీసులు అంటించి అవమానించారు
- బాస్ నేత పిటిఎం శివప్రసాద్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

బుద్ధుని విగ్రహానికి తల తొలగించి, ధ్వంసం చేసిన ఉన్మాదుల్ని పట్టు కోవడంలో ఘోరంగా విఫలం చెందిన అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు తమపై తీవ్రమైన వేధింపులకు పాల్పడుతున్నారని, అసలే తాను గుండె జబ్బుతో బాధపడుతున్నానని, తనకు ఏదైనా జరిగితే ఎస్‌పి విద్యాసాగర్ నాయుడే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) నేత పిటిఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బుద్ధుడి తల నరికిన దుర్ఘటన జరిగి ఇరవై రోజులకు దగ్గర పడుతున్నా ఇప్పటికీ ఆ ఉన్మాదుల్ని పట్టుకోలేదు గానీ, నిరసన తెలిపిన దళిత నేతలపై తప్పుడు కేసులు నమోదు చేసి వేదిస్తున్నారని ఆయన వాపోయారు. శనివారం రాత్రి పోలీసులు తమ ఇంటికి వస్తే, బుద్ధుని తలనరికినోళ్లను పట్టుకున్నామని చెప్పడానికి వచ్చారేమో అనుకున్నామని, అయితే తన మీద పెట్టిన మూడు తప్పుడు కేసుల తాలూకు నోటీసులు ఇవ్వడానికని చెప్పారు. ఇదేంటి సర్ ఇన్ని కేసులు ఎప్పుడు పెట్టారు. ఏ కారణం చేత పెట్టారు. అని అడిగితే, అదంతా తమకు తెలియదని, పై అధికారుల ఆదేశాల మేరకు వచ్చామని చెప్పి, వాళ్లు మా ఇంటి తలుపుకు మూడు నోటీసులు అంటించి వెళ్లారన్నారు. ఈనెల 4న తనను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి, షుగర్, బిపి ఉన్నా మూత్ర విసర్జనకు కూడా వెళ్లనియ్యకుండా తీవ్రమైన వేధింపులకు గురిచేసి, హార్ట్ అరెస్ట్‌కు గురయ్యేలా చేశారన్నారు. తర్వాత నేను నారాయణ హృదయాలయ కోలార్ బ్రాంచ్‌లో స్టెంట్ వేసుకొని, డాక్టర్ ఆదేశాల మేరకు వారం రోజులుగా రెస్ట్‌లో ఉన్నానని, మొన్న రాత్రి ‘బుద్ధునితో నా ప్రయాణం – డాక్టర్ అంబేడ్కర్’ అన్న నాటక ప్రదర్శనకు వెళ్లి రాగా, ఆ రాత్రి మళ్లీ పల్స్ తగ్గడంతో హాస్పిటల్ కు వెళ్లగా, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించిన అనంతరం ఒత్తిడి వల్ల ఇలా జరుగుతోందని డాక్టర్ చెప్పారన్నారు. మరో నెలరోజుల వరకూ రెస్ట్ లోనే ఉండాలని చెప్పి, మందులు ఇచ్చారన్నారు. కోలార్ హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చేసరికి పోలీసులు నోటీసులు పట్టుకొని ఇంటి కొచ్చారని, తాను ఎంత అనారోగ్యంతో ఉన్నా, వేధింపులకు గురి చేస్తున్నారంటే, ఎస్‌పి తనను ఏమి చేయాలనుకుంటున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము బుద్ధిస్టులమని, ఎవ్వరినీ ఇబ్బంది పెటట్టేవాళ్ళము కామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కలుగజేసుకొని బుద్ధుడి తల తొలగించి, ధ్వంసం చేసిన ఉన్మాదుల్ని పట్టుకొని శిక్షించాలని, దళితుడైన తనను తీవ్రమైన వేధింపులకు గురి చేస్తున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడుపై కేసు నమోదుకు ఆదేశించాలని శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

శివప్రసాద్ ఇంటికి నోటీసులు అంటిస్తున్న పోలీసులు

రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సకాలంలో గుర్తిస్తే కేన్సర్ నయం

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

సకాలంలో లక్షణాలను గుర్తిస్తే తగిన వందల ద్వారా కేన్సర్‌ను నయం చేసుకోవచ్చని రోటరీక్లబ్ మాజీ అధ్యక్షులు కృష్ణదేవరాయలు, కేన్సర్ వైద్యులు వైద్యుడు వంశీ విహారి ఎర్కొన్నారు. ఆదివారం స్థానిక డైట్ కళాశాల ఆవరణంలో రోటరీ క్లబ్, కడప మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య బృందం 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేన్సర్ ఏ దశలో ఉన్నా నయం చేయవచ్చుని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీతో మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా నయం చేయవచ్చుని పేర్కొన్నారు. కేన్సర్ లక్షణాలు ఉన్నట్లు తెలిసిన వెంటనే ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, వెంటనే సంబంధిత డాక్టర్ దగ్గరికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని కోరారు. అనంతరం వైద్యులను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో రాయచోటి రోటరీ క్లబ్ అధ్యక్షుడు వైవిఎస్ ప్రకాష్, మాజీ అధ్యక్షులు మనోజ్ కుమార్, జోషి ,సురేష్ కుమార్, కె వి ఎస్ నాయుడు, రెడ్డి శంకర్, మహమ్మద్ హుస్సేన్, రెడ్డన్న, అష్రఫ్ అలీ, రియాజుద్దీన్‌తో పాటు సభ్యులు చెన్నకేశ వులు షౌకత్ అలీ పాల్గొన్నారు.

తేక్వాండోతో ఆరోగ్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : తేక్వాండో ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెంపొందుతుందని అన్నమయ్య తేక్వాండో అకాడమీ మాస్టర్ పిచ్చయ్య తెలిపారు. ఆదివారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో పిచ్చయ్య ఆధ్వర్యంలో జాహీద్ అలీ, మనోజ్ కుమార్ నాయుడు పర్య వేక్షణలో తేక్వాండో బెల్ట్ గ్రేడింగ్ ఉత్తీర్ణత పరీక్షలు నిర్వహించారు. బ్లూ బెల్ట్ కు గౌతమ్, సాహితీ, వెంకట్ దీపేష్, గ్రీన్–1 కు రితీష్ రెడ్డి, ఎల్లో బెల్ట్‌కు సుహాన్, దీక్షిత, లక్ష్మి కీర్తిక, దర్శన్ నాయక్ ఉత్తీర్ణుల య్యారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్, హనుమంతరావు పాల్గొన్నారు.

18న గ్రామ కమిటీలపై సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆగస్టు 18న అన్నమయ్య జిల్లాలో నిర్వహించే నూతన గ్రామ కమిటీల సమీక్ష సమావేశాన్ని విజయ వంతం చేయాలని ఎం ఆర్‌పిఎస్ అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి కోట డానియల్ పిలుపు నిచ్చారు. ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు మంద శివయ్య ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల కార్యకర్తల సమావేశంలో కోట డానియల్ మాట్లాడుతూ అన్ని మండలాలలోనూ గ్రామ కమిటీలను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పాల్గొను కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జాతీయ నాయకులు వెలగచర్ల శివయ్య, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, చంగయ్య, మదనపల్లె పెంచలయ్య వడ్డెర, చేమూరు వెంకటేష్, రాజంపేట మండల అధ్యక్షులు హరి వడ్డెర, మండల అధ్యక్షులు బాలిపోగు సుబ్బయ్య, ఓబులవారిపల్లె మండలం సీనియర్ నాయకులు పోలి హరి, ఎంఎస్‌పి మండల అధ్యక్షులు పవన్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోట డానియల్

మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి అరెస్టు

- మదనపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లి

మాజీ ఎమ్మెల్యే, వైసిపి హిందూపురం పరిశీలకులు ఆర్. రమేష్ కుమార్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరా లు..చిన్నమండెం మండలం కదిరోళ్లపల్లిలో ‘బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ’ సమావేశంలో ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లె రాం ప్రసాద్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈనేపథ్యంలో రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు లక్కిరెడ్డిపల్లికు చేరుకుని టిడిపి కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిపై సిఐ కొండారెడ్డికి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేసి మదనపల్లె పోలీస్ స్టేషన్ తరలించినట్లు సిఐ తెలిపారు.

రమేష్‌కుమార్ రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రాజకీయ ఎదుగుదల ఓర్వలేకే అరెస్టు : వైసిపి

ప్రజాశక్తి- మదనపల్లె

రాష్ట్రంలో పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయంగా ఎదుగుదలను చూసి కక్షతోనే ఎంపీ మిథున్‌రెడ్డిని మద్యం స్కాంలో ఇరికించి అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్యెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి అన్నారు. ఆదివారం వారు వేర్వేరు విలేకర్ల సమావేశాలు ఏర్పాటు చేసి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీగా ఉన్న మిథున్‌రెడ్డి మూడు సార్లు గెలిచి ప్రజామన్ననలు పొందారన్నారు. ఇటు జిల్లాలోనూ, అటు రాష్ట్రంలోనూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన రాజకీయ ఎదుగుదలతో వీరి కుటుంబాన్ని ఎలాగైనా దిగజార్చాలని ఇలా అక్రమంగా కేసులు పెట్టించి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేయడాన్ని తప్పుపట్టారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ఇలాంటివి మానుకోవాలని అన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో తీవ్ర మైన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, జడ్‌పిటిసి ఉదయ్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాలగంగాదర్‌రెడ్డి, సురేంద్ర, మస్తాన్ రెడ్డి, కౌన్సిలర్లు రాజేష్,వెలుగు చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేపారి బషీర్‌ఖాన్ మృతికి నివాళి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : వైసిపి మైనారిటీ సీనియర్ నాయకులు బేపారి బషీర్ ఖాన్ మృతికి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి నివాళి అర్పించారు. ఆదివారం బషీర్‌ఖాన్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బషీర్‌ఖాన్‌తో తనకున్న అనుబంధాన్ని ఆయన గుర్తుకు చేసుకుని అయన దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రజలకు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. వారి కుమారుడు బేపారి మహమ్మద్‌ఖాన్‌ను, కుటుంబసభ్యులను శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, కొలిమి ఛాన్‌బాష, జాకీర్ బాష, రియాజ్, అన్నా సలీం, రియాజుర్ రెహమాన్, కొత్తపల్లె ఇంతియాజ్ నివాళులు అర్పించారు.

20 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లిలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 20 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు నియోజకవర్గంలోని కెవిపల్లె, ఎర్రవారిపాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెంలతో పాటు కదిరి, ఎన్.పి.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుండి వచ్చిన 45 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో అర్హులైన 20 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, కంటి వైద్యులు భార్గవి, మహాలక్ష్మి, ఆప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసిలో సొమ్ము భద్రం

-లియాఫీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి
- కడప బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎల్ఐసిలో పాలసీదారులు పెట్టిన సొమ్ము భద్రంగా ఉంటుందని, వారికి మంచి సేవలు అందుతాయని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.బి. శ్రీనివాసచారి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఫంక్షన్ హాల్‌లో లియాఫీ 15వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజీవన్ శ్రీ పాలసీ 9.5 శాతం వడ్డీతో ప్రజలకు అందుబాటులో ఉందని చెప్పారు. దేశంలో ఇంత పెద్ద మొత్తంలో వడ్డీ ఇచ్చే సంస్థలు, బ్యాంకులు ఏవి లేవని తెలిపారు. ఈ పాలసీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఏజెంట్లకు పిలుపునిచ్చారు. ఏజెంట్ సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఏజెంటు, వారి కుటుంబానికి గ్రూప్ ఇన్సూరెన్స్ వయస్సు 69 సంవత్సరాల నుంచి 85 సంవత్సరాల పెంచేలా పోరాడుతామని హామీ ఇచ్చారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెరిగేలా కృషి చేశామని తెలిపారు. గ్రాడ్యుటీ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచేలా కృషి చేశామని చెప్పారు. లియాఫీ చైర్మన్ నారాయణరెడ్డి, జోనల్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కడప డివిజన్ సెక్రటరీ జనరల్ కదిరప్ప, అధ్యక్షులు జయభరత్‌రెడ్డి, కోశాధికారి కృష్ణ, ఎల్ఐసి ఎస్‌డిఎం జి. కె. ఆర్.వి రవికుమార్, మార్కెటింగ్ మేనేజర్ టి. శ్యామ్ సుందర్‌రావు, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ కడప డివిజన్ కార్యదర్శి ఎ. రఘునాధరెడ్డి ప్రసంగించారు.

కడప బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక

లియాఫీ కడప బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహి ంచారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఆర్. నిత్యానందరెడ్డి, కార్యదర్శిగా ఎస్. వీరభద్రుడు, ఉపాధ్యక్షులుగా సుబ్బిరెడ్డి, కోశా ధికారిగా కె.వి. రమ ణారెడ్డి, సభ్యులు ఎన్నిక య్యారు. వీరితో ఎన్నికల అధికారులుగా వ్యవ హరి ంచిన వారు ప్రతిజ్ఞ చేయించారు. సమా వేశంలో లియాఫీ కడప బ్రాంచ్ సభ్యులు వి.గంగాధరయ్య, చెన్నూరు చెన్నయ్య, కె.శ్రీని వాసులు, శంకరరెడ్డి, బి. మునయ్య, ఎం.నరసింహ, ఎ.శ్రీనివాసులు, చంద్ర మోహన్‌రెడ్డి, రామలిం గారెడ్డి, కడప డివిజన్ ఉపాధ్యక్షులు బి.రాజేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శి ఎస్. ఇస్మాయిల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న నూనత కార్యవర్గం

పర్యాటకులతో సందడిగా హార్సిలీహిల్స్

హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల రద్దీ

- ఆహ్లాదకర వాతావరణంలో సందడి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం,ఆంధ్ర ఊటీగా ప్రసిద్ధిగాంచిన హార్సిలీహిల్స్ పర్యాటకులతో ఆదివారం రద్దీగా మారింది. సెలవు కావడంతో బంధుమిత్రులతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో సందడి చేశారు. పిల్లలు ఆటపాటలతో కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా పలువురు పర్యాటకులు హార్సిలీహిల్స్ అందాలు ప్రకృతి రమణీయమని, పనులు ఒత్తిడి నుంచి ఉపశమనం లభించిందన్నారు. పర్యాటక శాఖ అధికారులు అన్ని వసతులు కల్పించారు. ఇక వేసవి కాలంలో పర్యాటకులు నిరంతరం హార్సిలీహిల్స్‌కు వచ్చి విశ్రాంతి తీసుకుంటారు.

మాట్లాడుతున్న సర్తాజ్ హుస్సేన్

పోటీతత్వం ఉంటేనే రాణించగలరు

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక భారతీయ విద్యా నికేతన్ పాఠశాల నందు జిల్లాస్థాయి హిందీ వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీలకు పలు మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వం అనే లక్షణాన్ని తప్పకుండా కలిగి ఉండాలన్నారు. పోటీ తత్వం ఉంటేనే ఏ రంగంలో అయినా రాణించగలరన్నారు. అనేక మందితో పోటీపడినప్పుడే మనం ఏ స్థాయిలో ఉన్నామనే విషయం తెలిసి వస్తుందన్నారు. పోటీలలో ప్రతిభ కనబరచిన ముగ్గురు విజేతలకు ఈ నెల 31న ప్రముఖ హిందీ రచయిత ప్రేమ్‌చంద్ జయంతి సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు చాంద్‌బాషా, రాజశేఖర్, సైరాబాన పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాగూర్ వలి, పఠాన్ ఖాదర్ ఖాన్

ఆర్‌టిసిని అభివృద్ధి పథంలో నడిపించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపిఎస్‌ఆర్‌టిసిని అభివృద్ధి పథంలో నడిపించాలని మదనపల్లె - 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలిని రాష్ట్ర రవాణా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. ఆదివారం చిన్నమండ్యం మండలం, బోరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన విరుపాక్షమ్మ బోనాల కార్యక్రమంలో భాగంగా మంత్రిని ఆయన నివాసంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్ ఖాన్, సర్పంచ్ ప్రభాకర్, ప్రవీణ్ రాయల్, నాయి బ్రాహ్మణ సమితి సభ్యులు ప్రభాకర్, సిబిఎన్ రెడ్డి శేఖర్, బండి అమర, టెంపర్ రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లాడుతూ మంత్రి సలహాలు, సూచనలతో మదనపల్లె ఆర్‌టిసి 1, 2 డిపో లను అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. అనంతరం మంత్రిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఆడికృతిక సందర్భంగా పుల్లంపేట మండలంలోని పుల్లంపేటలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి భక్తులకు హారతి తీర్థ ప్రసాదాలు అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం సుబ్రహ్మణ్యంస్వామి వారికి వల్లి దేవసేనతో పేద పండితులచే అంగరంగ వైభవంగా కల్యాణం జరిపిం చినట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం హాజరైన ప్రజలకు అన్నదాన కార్యక్ర మాన్ని చేపట్టినట్లు తెలిపారు. సాయంత్రం వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారిని పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-పుల్లంపేట



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

మండల పరిధిలోని పివిజిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో 2009-2010 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు సమా వేశాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో బయాలజీ టీచర్ ఎం.నాగేశ్వర నాయక్ ప్రస్తుతం ముద్దనూరు ఎంఇఒగా పనిచేస్తున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉండేటువంటి జ్ఞాపకాలన్నీ గుర్తుతెచ్చుకున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సంస్కారం, వినయ విధేయ ఆభరణాలని పేర్కొన్నారు. కార్యక్ర మంలో ఉపా ధ్యాయులు రవికుమార్, సుధాకర్, శ్రీనివాసులు , పూర్వ విద్యార్థులు ఎం దినేష్, మహేష్, ప్రసన్న కుమారి, శేషమని, సుధామణి ,దేవికారాణి పావని, మమత, కోటే శ్వరరావు, పాల్గొన్నారు.

రోడ్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీ వాసులకు చెందిన సిమెంట్ రోడ్డును తొలగించిన టిడిపి నాయకుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసిపి మైనార్టీ సెల్ కన్వీనర్ బాబ్జి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేస్తే ప్రస్తుత ప్రభుత్వంలో దౌర్జన్యంగా రోడ్డును తొలగించడం ఏమిటని ప్రశ్నించారు.

CHANGE OF NAME

I, SYED MAHAMMD SUHEL (old name), resident of D.No.29/116, Alimabad Street, Rayachoty, Annamayya Dist., Andhra Pradesh. Henceforth be known as **SYED MOHAMMAD SUHAIL (new name).** This may please be noted for all future correspondence, if any.

కొండెక్కిన కూరగాయల ధరలు

- భగ్గు మంటున్న మిర్చి, మునగ ధరలు
- అదే దారిలో చిక్కుడు, అల్లం ఇతర రకాలు
- ఆందోళనలో కొనుగోలుదారులు

ప్రజాశక్తి-పుల్లంపేట

కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. శ్రావణ మాసానికి ముందే కొనుగోలుదారులలో కలవరింత మొదలైంది. టమోటా కిలో రూ.40 మిగిలిన కూరగాయలు రూ.50 నుంచి రూ.70 చొప్పున మార్కెట్లో విక్రయాలు జరుగుతున్నాయి. పెరిగిన ధరలకు తప్పనిసరి పరిస్థితులలో కొనుగోలుదారులు తక్కువ మొత్తంలో కూరగాయలను తీసుకెళుతున్నారు. వాతావరణ పరిస్థితి మారిన నేపథ్యంలో దిగుబడులు ఆశాజనకంగా రాలేదు. తాజాగా ధరల పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్లో రూ.200 చెల్లించిన కేజీ చొప్పున ఐదు రకాల కూరగాయలు కూడా లభించడం లేదని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. కొనుగోలుదారులు అధిక ధరలు చెల్లించలేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని ధరలు తగ్గించేందుకు ప్రయత్నం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అక్కడక్కడ కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బ తినడంతో ప్రస్తుతం కూరగాయలకు డిమాండ్ పెరిగింది. డిమాండుకు తగ్గట్టుగా స్థానిక కూరగాయలు లేకపోవడంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవలసి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. మరో పది రోజులలో ఆషాడమాసం ముగుస్తుంది. శ్రావణమాసంలో ధరలు మరింత పెరిగే అవకాశ ముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల ధరలు పది రోజుల క్రితం నుంచి రెండేంతలు పెరగడం జరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. చిక్కుడు కిలో రూ.60కు లభించేది ఇప్పుడు రూ.120 కి పెరిగింది. మిర్చి ధర కిలో రూ.50 నుంచి రూ.120, వంకాయ కిలో రూ.40 నుంచి రూ.70, అల్లం కిలో రూ.60 నుంచి రూ.80 కి, బెండకాయ కిలో రూ.20 నుంచి రూ.40, బీరకాయ కిలో రూ.40 నుంచి రూ.60, బీన్స్ కిలో రూ.40 నుంచి రూ.60, క్యాప్సికం రూ.40 నుంచి రూ.60కు, క్యాబేజీ కిలో రూ.20 నుంచి రూ.30కి, కొత్తిమీర రూ.20 నుంచి రూ.40, ములక్కాడలు ఒక్కటే ఐదు నుంచి పదికి, క్యారెట్ రూ.30 నుంచి రూ.50 లకు పెరగడం జరిగిందని వ్యాపారస్తులు చెబుతున్నారు. బంగాళదుంపలు కిలో రూ.20 నుంచి రూ.40 కి చేరాయి. పెరిగిన ధరలు కొనుగోలుదారులకు చమటలు పట్టిస్తున్నాయి.

ధరల పెంపును నియంత్రించాలి

కూరగాయల ధరలు బగ్గు తాజాగా పెరిగిన ధరల ఫలితంగా నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంటిలో నెలకు రూ.15 వందల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. నెలరోజుల క్రితం వరకు కూరగాయల కోసం వారానికి కేవలం రూ.400 నుంచి రూ.500లు వరకు ఖర్చయ్యేది. ప్రస్తుతం మాంసం ధరతో పాటు కూరగాయలు పోటీ పడుతున్నాయి. అధికార యంత్రాంగం చొరవ తీసుకొని ధరలను నియంత్రించి కొనుగోలుదారులకు ఉపశమనం కల్పించాలి.

-లక్ష్మీదేవి, పుల్లంపేట

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం : 'గడికోట'

క్యూఆర్ కోడ్‌ను చూపుతున్న బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-చిన్నమండెం

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలం వండాడి గ్రామం కదిరివాండ్లపల్లెలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దేవనాథ రెడ్డి అధ్యక్షతన రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హిందూపురం వైసిపి పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి, జడ్‌పి మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం హజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూఎన్నికలలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు నయవంచన చేస్తున్నారన్నారు. ఓట్లు వేయించుకుని అవసరం తీరాక హామీలను గాలికి వదిలేశారని అన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వడం లేదని, బడుగు బలహీన వర్గాలకు 50 ఏళ్లకు పింఛన్ ఇవ్వడం లేదని, జాబ్ కేలండర్ విడుదల చేయకుండా, ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి చెల్లింకుండా యువతను దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 ఏళ్ల నిండి 59 ఏళ్ల వయసు వరకు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఏడాది దాటినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యకర్తలకు, నాయకులకు కష్ట నష్టాలలో తోడుగా నిలుస్తామని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో చెప్పిన ఏ హామీని ఏడాది దాటినా అమలు చేయలేదన్నారు. సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ అధికార పార్టీ నేతల అక్రమాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి , వైస్ ఎంపిపి జాస్, సర్పంచుల సంఘ అధ్యక్షుడు ముసల్ రెడ్డి, సీనియర్ నాయకులు రంగారెడ్డి, పడమటి కోన బాబురెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు. **తంబళ్లపల్లి** :ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని అధికారం చేతికించుకోగానే హామీలను గాలికి వదిలి ప్రజలను దగా చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం తంబళ్లపల్లి ఎస్ఎల్‌వి కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాని నిర్వహించారు. మండలంలో నలుమూలల నుండి ప్రజా ప్రతినిధులు పార్టీ విభాగాలకు చెందిన వారు నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు అధికారం రాగానే దుష్ట పాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్ సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపిపి కరీం, కోటిరెడ్డి, నాయకులు శ్రీనివాసులు, సురేంద్ర, కెఆర్ మల్‌రెడ్డి, జ్యోతి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం : వైసిపి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట : మాట్లాడుతున్న ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి

రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పేర్కొఆన్నరు. ఆదివారం ఆకేపాటి భవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని ఆరోపించారు. కూటమి ఇచ్చిన హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే కూటమి ప్రభుత్వం అభివృద్ధిని మరచి కక్షసాధింపుతో ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపడమే పనిగా పెట్టుకుందని అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి లిక్కర్ స్కాంకు ఏ సంబంధం ఉందని అరెస్టు చేశారని ప్రశ్నించారు. ఆయనపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, అన్నమాచార్య యూనివర్సిటీ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, మిరియాల సురేఖ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పథకం ప్రకారమే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. **కలకడ:** రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం బాధాకరమని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని అన్నారు. **కలికిరి:** ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ వైసిపి మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు కలికిరి క్రాస్ రోడ్‌లో నిరసనలు వ్యక్తం చేశారు. **రామసముద్రం :** మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం కక్ష సాధింపు చర్యలో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు చేశారని మండల జడ్‌పిటిసి సిహెచ్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కుసుమ కుమారి, మండల కన్వీనర్ కేశవరెడ్డి, మదనపల్లి తాలూకా బిసిసెల్ అధ్యక్షులు దొడ్డిపల్లి ఆనంద్, స్టేట్ బిసి సెల్ జనరల్ సెక్రటరీ గెవన్న , మండల బూత్ కన్వీనర్ అనప్పల్లి కేశవ, సర్పంచ్ ఉదయ్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.**పీలేరు:** ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం కుట్రపూరిత చర్యేనని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి తెలిపారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఎంపీ అరెస్టును ముక్తకంఠంతో ఖండిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు నారే వెంకటరమణారెడ్డి, నాయకులు జ్ఞాన శేఖర్ రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు. **నందలూరు :** రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం ఎంతోకాలం సాగదని రాజంపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, నల్లతిమ్మాయపల్లి సర్పంచ్ గీతాల నరసింహారెడ్డి పాల్గొన్నారు. **పుల్లంపేట :** కూటమి నాయకుల కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అక్రమ అరెస్టు చేశారని వైసిపి రాయలసీమ జోనల్ బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు మానుకొని ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి ప్రజా పాలన మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగమాల రామచంద్రారెడ్డి, గల్లా శ్రీనివాసులు, కోట లక్ష్మీదేవి సునీల్, వెంకటసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. **వీరబల్లి :** ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమని మాజీ ఎంపిపి విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని చూసి కూటమి ప్రభుత్వం వణికి పోతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిల సంఘం ఉపాద్య క్షుడు, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మనీరాజు,నాగభూషణం, శ్రీరాములురెడ్డి, సుబ్బరామరాజు నరేష్ స్వామీ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జడ్‌పిటిసి రమాదేవి, మాజీ ఎంపిపి రెడ్డయ్య, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి, సుబ్బరాయుడు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రూ.70లక్షలతో తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

నియోజకవర్గ పరిధిలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలకు రూ.70 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కరించామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు ఆదివారం లక్కిరెడ్డిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా ఈ రెండు మండలాలలో ప్రతి గ్రామానికి సిసి రోడ్లు, తారు రోడ్లు, మౌలిక వసతులు కల్పించామని అన్నారు. ఆర్‌ఆర్ కుటుంబం గతంలో నియోజకవర్గంలో ఉన్న లక్కిరెడ్డి పల్లెకు ఏం చేశారో చెప్పాలన్నారు. మండిపల్లి నాగిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా రాయచోటిని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి 2029 లో కూడా ఎన్నికలకు వెళ్తామన్నారు . అసత్యాలు చెప్పి ప్రజలను మోసం చేసేవారు కాదని మోసం చేసిన వారు ఏమయ్యారో ప్రజలకే తెలుసని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి మదన్మోహన్, మాజీ జడ్‌పిటిసి రెడ్డయ్య, చెన్నకేశవరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ షఫీ నాయక్ పాల్గొన్నారు.

రోజాపై టిడిపి ఎమ్మెల్యే వ్యాఖ్యలు బాధాకరం

ప్రజాశక్తి - చాపాడు : మాజీ మంత్రి రోజాపై నగిరి టిడిపి ఎమ్మెల్యే భాను ప్రకాష్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి ఖండించారు. ఈ వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు. మహిళలను రాజకీయంగా అణగదొక్కాలనే కుట్ర ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. మహిళలు రాజకీయంగా రాణించా లంటే ఎన్నో అవరోధాలు, అడ్డంకులు దాటుకుని నిలబడాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్న రోజాపై వ్యక్తిగత దూషణలు, విమర్శలు ప్రజాస్వామ్యం కాదన్నారు.

అందుబాటులో యూరియా : ఎఒ

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలోని సచివాలయాల్లో యూరియా అందుబాటులో ఉంచుతున్నామని మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. రైతుల నుండి యూరియా కావాలని వినతులు అందుతుండడంతో అన్ని సచివాలయాలకు యూరియాను అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఎకరాకు ఒక బస్తా, ఎకరాకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు రెండు బస్తాలు యూరియా పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియాను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

మరమ్మతులకు నోచని మంచినీటి బోరు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పంచాయతీ యల్లంపల్లి ప్రాథమిక పాఠశాల, అంగ న్వాడీ కేంద్రం ఆవరణం లో ఉండే మంచినీటి చేతి పంపు బోరు అనతికాలంలో మరమ్మ త్తులకు గురై మూలకు చేరింది. వాటిని సకాలంలో బాగు చేయకపోవడంతో స్థానికులు విద్యార్థులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరు ప్రజలకు విద్యార్థులకు ఉపయోగపడేలా చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా నాయకులు అధికారులు స్పందించి మట్లి ప్రాథమిక పాఠశాలలో ఉండే చేతిపంపు పంపు బోరుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక చర్యలు తీసుకోండి :సిఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

మదనపల్లె రూరల్ సర్కిల్ సిఐ సత్యనారాయణ ఆదివారం నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ లో ఎస్ఐ తిప్పేస్వామితో కలిసి పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేక చర్యలు చేట్టాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటిని తక్షణం పరిష్కరించడానికి ప్రయత్నించాలన్నారు. వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్ల చోరీలు నిత్యం జరుగుతున్నాయని ప్రత్యేక నిఘా ఉంచి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీలు నిర్వహించాని చెప్పారు. మండలంలోని ప్రతి రోడ్డు మార్గంలోను, ప్రతి దుకాణాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయించాలని పేర్కొన్నారు. రౌడీ షీటర్లు, గంజాయి స్మగ్లింగ్, అక్రమ మద్యం వ్యాపారంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిం చాలని, బాధితుల ఫిర్యాదును స్వీకరించి సమ స్యను పరిష్కరించాలన్నారు. ప్రజలలో పోలీసులపై మంచి అభిప్రాయం ఏర్ప డేలా వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కాపర్ వైరు చోరీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

బోరు కేబుల్‌ను కత్తిరించిన దుండగులు

వ్యవసాయ బోర్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ వైర్లను దొంగలిస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నిమ్మనపల్లి మండలం, ము గ్రామం మర్రిబండ వద్ద కేబుల్ వైర్ల చోరీ ఘటన శనివారం రాత్రి జరిగింది. రైతు ఆదిరెడ్డికి చెందిన వ్యవసాయ బోరుకు అమర్చిన 25 మీటర్ల కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు కత్తిరించుకు వెళ్లారు. ఆదివారం ఉదయం బోరు వద్దకు వెళ్లిన రైతు ఆది మోటరు వదలడానికి ప్రయత్నించగా మోటర్ పనిచేయకపోవడంతో గమనించగా కేబుల్ వైర్లను కత్తిరించిన దృశ్యం కనిపించిందన్నారు. కేబుల్ వైర్ చోరీకి గురైందని గ్రహించి, తీవ్రంగా నిరాశ చెందారు. వేలాది రూపాయలు వెచ్చించి ఒకపక్క బోర్లు మరమ్మతులు చేసుకుంటూ, మరోపక్క గిట్టుబాటు ధరలు లేని వ్యవసాయంతో బాధపడుతుంటే, కేబుల్ వైర్లు చోరీ ఘటన తమపై గుద్దిబండగా పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఇటీవల కాలంలో పలుచోట్ల కేబుల్ వైర్లు చోరీ జరిగిందన్నారు. స్థానిక పోలీసులు కేబుల్ వైర్ల దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను వెంటనే గుర్తించి రైతులను ఆదుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కడుపు కోతను జీర్ణించుకోలేని ఓ తల్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన ఆదివారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శివపురం కు చెందిన ప్రభుదేవా, లతమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తిరిగి 10 నెలల క్రితం మరో ఇద్దరు మగ శిశువులకు (కవలలు) జన్మనిచ్చింది. కాగా అ కవలల పిల్లల్లో ఓ బాలుడు తీవ్ర అనారోగ్యానికి గురై రెండు నెలల క్రితం మృత్యు వాత పడ్డాడు. అప్పటినుంచి తీవ్ర మనోవేదనకు గురైన లతమ్మ బిడ్డను తలుచుకుంటూ కుమిలిపోతూ ఉండేది. బిడ్డను కాపాడుకోలేకపోయానన్న బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పెద్దమండ్యం పోలీసులు విచారణ చేస్తున్నారు.

బంగారం చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

బంగారం చోరీ జరిగిన విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ కొండయ్యగారిపల్లెకు చెందిన మల్లెల పురుషోత్తం రెడ్డి ఇంటిలోకి ఇటీవల గుర్తి తెలియని వ్యక్తులు ప్రవేశించి, అల్మారను బద్దలు కొట్టి సుమారు 49 గ్రాములు రూ.1.60 లక్షలు విలువ గల బంగారు చైను అపహరించకు వెళ్లారని అన్నారు. ఆదివారం నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



చికిత్స పొందుతున్న బాధితులు

ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురు గాయపడిన సంఘటన ఆదివారం చౌడేపల్లి మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. సోమల మండలం, నెల్లిమందకు చెందిన గంగులప్ప కుమారుడు మునిరాజ, తల్లి వెంకటలక్ష్మి, మరదలు రెడ్డీశ్వరి, కుమారుడు ముని దినేష్ కలిసి పొట్టేలును తీసుకొని ఆటోలో బోయకొండ గంగమ్మ దర్శనార్థం బయలుదేరారు. మార్గమధ్యంలోని చౌడేపల్లి వద్ద పొట్టేలు ఆటోలోంచి దూకడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న మునురాజుతో పాటు వెంకటలక్ష్మి, రెడ్డిశ్వరి, ముని దినేష్ కిందపడి గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాధితులను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. చౌడేపల్లి పోలీసులు విచారిస్తున్నారు.